ఇల వైకుంఠం

వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ (ఇన్‌సెట్‌లో) అందంగా ముస్తాబైన కల్యాణ వేదిక, పెండ్లి కుమారుడిగా స్వామివారు









కల్యాణం.. కమనీయం

వెంకటపాలెంలో ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

- తిరుమలను తలపించిన అమరావతి
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- హాజరైన సీఎం దంపతులు, గవర్నర్, ఇతర ప్రముఖులు

తిరుమలేశుని తిరు కల్యాణ మహోత్సవంతో ఆధ్యాత్మిక నగరి అమరావతి అపర వైకుంఠాన్ని తలపించింది. అన్నమయ్య సంకీర్తనాగానాలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, ముచ్చటైన మంగళవాయిద్యాల నడుమ వెంకటపాలెంలోని తిరుమల తిరుపతి దేవస్థాన ప్రాంగణంలో శనివారం సాయంసంధ్యవేళ ఉభయ దేవేరుల సహితంగా శ్రీవారి కల్యాణోత్సవం జరిగింది. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి ఉత్సవాన్ని కనులారా వీక్షించి తరించేందుకు అశేష భక్తవాహిణి అమరావతికి తరలిరాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. - ఆంధ్రజ్యోతి, గుంటూరు

● ఇక ఒంటిపూట

జిల్లాలోని అన్ని పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు మొదలయ్యాయి. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొన్ని పాఠశాలలకు సెలవులు కూడా ప్రకటించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు మిట్ట మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడ్డారు. విజయవాడలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శనివారం ఇలా చున్నీ కప్పుకొని ఇంటికి బయల్దేరారు.



వైభవంగా దివ్యభవ్య గరుడ సేవ

» ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లిన మచిలీపట్నం

6లో

మిగులుతో దిగులు

ఉమ్మడి కృష్ణాజిల్లా రేషనలైజేషన్‌లో 600 మంది ఉద్యోగుల మిగులు

రెవెన్యూ శాఖకు చెందినవారే ఎక్కువ

- 300 పైబడి వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు
- ఇతర శాఖలకు వెళ్లాలంటున్న ప్రభుత్వం
- ఒప్పుకోమంటున్న వీఆర్వోలు
- రెవెన్యూలోనే కొనసాగించాలంటూ పట్టు



గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 600 మంది ఉద్యోగులు మిగులు తేలారు. వీరిని వివిధ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పంచాయతీరాజ్‌కు జవసత్వాలు ఇచ్చేందుకు ఇది దోహదపడుతుంది. ఇతర శాఖల్లోనూ ఖాళీ పోస్టుల కొరత తీర్చనుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో మిగులు ఉద్యోగుల్లో సగభాగం రెవెన్యూ ఉద్యోగులే ఉన్నారు. మొత్తం 600 మంది మిగులు ఉద్యోగుల్లో 300 మంది వరకు వీఆర్వోలు ఉన్నారు. మిగిలిన వారిలో 50 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు, మిగతావారు ఇంజనీరింగ్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతరులు.

వీఆర్వోల ఆందోళన

రేషనలైజేషన్ ప్రక్రియలో సగభాగం వీఆర్వోలు ఉండటంతో వారందరినీ వేరే శాఖకు బదిలీ చేశారు. దీనిపై వీఆర్వోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూలోనే తమను కొనసాగించాలని పట్టుబడుతున్నారు. సమస్యను రెవెన్యూ సంఘ నేతల దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణ తెలపాలని ఒత్తిడి తెస్తున్నారు. 2012-14 సంవత్సరంలో నియమితులైన వీఆర్వోలు మాత్రం తాము ఏ శాఖకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు. మిగిలిన వారు మాత్రం ససేమిరా అంటున్నారు. సచివాలయ వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నట్టుగా.. సాధారణ రెవెన్యూ విభాగంలోని వీఆర్వో ఖాళీ పోస్టుల్లోకి వెళ్లడానికి వీల్లేదు. ఎందుకంటే.. 2008లో ఏపీపీఎస్సీ ద్వారా డైరెక్టుగా వీఆర్‌ఏ పోస్టుల కోసం పరీక్షలు రాసి పాసై కొంతకాలం వీఆర్‌ఏలుగా పనిచేశారు. ఆ తర్వాత వీఆర్వోలుగా పదోన్నతులు అందుకున్నారు. పదోన్నతికి ఇంటర్‌ను విద్యార్హతగా పేర్కొన్నారు. అయితే, పదో తరగతి అర్హతతో ఎంపికైన తమకు మధ్యలో విద్యార్హతలను మార్చి అన్యాయం చేయటమేమిటని వీఆర్వోలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు కోర్టులో విచారణలో ఉంది. కాబట్టి ఖాళీ వీఆర్వో పోస్టులను ఇప్పటికిప్పుడు భర్తీ చేయటం కుదరని పరిస్థితి.

ఎందుకు వెళ్లనంటున్నారు?

రెవెన్యూ శాఖలో త్వరగా పదోన్నతులు ఉంటాయి. వీఆర్వోల నుంచి ఆర్ఐ, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ పోస్టులకు అవకాశం ఉండటంతో సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ఆ శాఖను వదిలి వెళ్లనం టున్నారు. దీనికి తోడు ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఎక్కువగా ఉండే రెవెన్యూ శాఖ పరిధిలో విచ్చలవిడిగా అవినీతి వ్యవహారాలు ఉండటం వల్ల.. వాటికి అలవాటు పడిన కొందరు ఇతర శాఖలకు వెళ్లడానికి ఇష్టపడట్లేదని తెలుస్తోంది.

ఇతర శాఖల్లో పనిచేస్తే తప్పేంటి?

సచివాలయ వీఆర్వోలు ఇతర శాఖల్లో పనిచేస్తే వచ్చే నష్టమేమీ ఉండదు. మిగులుగా ఉన్నారన్న పేరుతో ప్రభుత్వం వారి ఉద్యోగాలను తొలగించట్లేదు. వారిని వేరే శాఖలో ఖాళీగా ఉన్నచోట మాత్రమే పోస్టింగ్ ఇస్తోంది. ఒక ఉద్యోగిగా ప్రభుత్వం ఎక్కడ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా విధులు నిర్వహించాలి. ప్రస్తుతం సచివాలయాల్లో అనేక శాఖల ఒత్తిడిని కూడా వీఆర్వోలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో వారిని ఇతర శాఖలకు పంపడం వల్ల ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.

పంచాయతీలపై తగ్గనున్న భారం

ప్రస్తుతం పంచాయతీల్లో సమర్థవంతమైన పరిపాలనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఐదారు పంచాయతీలకు ఒకే ఒక్క కార్యనిర్వహణాధికారి (ఈవో) పని మిగతా 6లో..

అవినీతికి తావులేదు

ఆధారాలతో వస్తే ఎంతటి వారైనా చర్యలు

టీడీపీ స్థానిక నేతల సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గంలో అవినీతికి తావులేదని, ఎవరైనా, ఎంతటివారైనా అవినీతికి పాల్పడినట్టు ఆధారాలతో నిరూపిస్తే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా ఇచ్చారు. స్థానిక ప్రజావేదికలో గుడివాడ పట్టణ, రూరల్ మండల పార్టీ నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి మంజూరైన రూ.10 కోట్లతో గుడివాడలో త్వరలో పనులు ప్రారంభ మవుతాయన్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని పాత పంపుల చెరువుకు మరమ్మతులు చేయించామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. గుడివాడ-కంకిపాడు రహదారికి తాత్కాలిక పనులు చేపట్టామని, కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో రహదారిని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గుడివాడ అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలను సిద్ధం చేశానని చెప్పారు. తనతో సహా అందరూ టీడీపీ కార్యకర్తలేనన్నారు. గుడివాడ పేరును చెడగొట్టేలా అసత్య వదంతులను వ్యాప్తిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరికైనా అన్యాయం జరిగిందా.. అని వెనిగండ్ల ప్రశ్నించారు. పార్టీలో అంతర్గత విషయాలుంటే తన దృష్టికి తీసుకురావాలని, సోషల్ మీడియా వేదికగా అనవసర పోస్టులు పెడితే సీరియస్‌గా పరిగణిస్తానని హెచ్చరించారు. ఇప్పటివరకు సొంత డబ్బునే అవసరాలకు వినియోగిస్తున్నానని, నిజాయితీగా ఉంటూనే పార్టీ శ్రేణులను బలోపేతం చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నానన్నారు. గుడివాడలో టీడీపీ గెలుపునకు అందరూ కృషి చేశారని, కష్టపడిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ప్రాధాన్యత ఉంటుందన్నారు. వర్గాల పేరుతో అనవసర రాద్ధాంతం వద్దన్నారు. ఎక్కడైనా అవినీతి జరిగిందనిపిస్తే ఆధారాలతో వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు గుడివాడ అభివృద్ధికి నిధులను కేటాయిస్తున్నారని వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, రూరల్ అధ్యక్షుడు మురళీ, నాయకులు లింగం ప్రసాద్, పంద్రాజు సాంబశివరావు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కోకో ధర ధమాల్!

సగానికి పైగా పడిపోయిన రేటు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

8లో





ఇఫ్తార్ (సాయంత్రం): 06-22(ఆది)
సహర్ (ఉదయం): 04-55 (సోమ)

● పరిశుభ్రత



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చల్లపల్లిలో శనివారం తెల్లవారుజామున జరిగిన స్వచ్ఛసేవలో కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో చీపురు పట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. 6లో

ప్రజా సమస్యలను పరిష్కరించండి

పదిలో ఉత్తమ ఫలితాలు రావాలి



జెడ్పీ స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్

» పాఠశాలల మనుగడకు ఇబ్బంది రానీయొద్దు
» పశుసంపదను కాపాడేందుకు చర్యలు తప్పనిసరి
» ఇంటి నిర్మాణాలు పూర్తయితే బిల్లులు ఇవ్వండి
» జెడ్పీ స్థాయీసంఘం సమావేశాల్లో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆదేశించారు. జిల్లా పరిషత్ ఏడు స్థాయీసంఘాల సమావేశాలు శనివారం స్థానిక జెడ్పీ సమావేశ హాల్లో జరిగాయి. వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. తొలుత స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి కట్టుబడి ఉంటామని అధికారులు, ప్రజాప్రతినిధులతో జెడ్పీ చైర్‌పర్సన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు జెడ్పీ ద్వారా స్మార్ట్ స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామన్నారు. సాయంత్రం సమయంలో పోషకాహారాన్ని కూడా సమకూర్చామన్నారు.

పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

విద్యాశాఖపై సమీక్ష జరిగిన సమయంలో.. నందివాడ మండలం ఒద్దులమెరక గ్రామ పాఠశాలలో గతంలో పదిమంది పిల్లలు ఉండేవారని, నేడు మిగతా 6లో..

ఓఆర్‌ఆర్‌పై రియల్ ఆశలు

అమరావతివైపు పొరుగు రాష్ట్రాల రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్ల చూపు

విజయవాడ బిల్డర్లతో సంప్రదింపులు.. ఓఆర్‌ఆర్ గురించి వాకబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)పై పొరుగు రాష్ట్రాల రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు ఆశ పెట్టుకున్నారు. ఈ రింగ్ రోడ్డుకు భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై పనులకు శంకుస్థాపన జరిగే క్షణం కోసం మిగతా 6లో..

ఆర్థిక ఇబ్బందులతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య!

8లో

వైభవంగా తిరుపతమ్మ రథోత్సవం

6లో



శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు






అమరావతిలో.. శ్రీవారి కళ్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు




గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డు ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డు ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ



కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు



గరుడ వాహనాలపై నారాయణమూర్తుల ఊరేగింపు

వైభవంగా దివ్యభవ్య గరుడ సేవ

- ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లిన మచిలీపట్నం

మచిలీపట్నం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జగద్గురు శ్రీరామానుజాచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో దయాకుంబ్ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం వెంకటేశ్వర థియేటర్ నుంచి కోటిసెంటర్, కోనేరుసెంటర్, రాజాసెంటర్‌ల మీదుగా యతి రాజ భవన్‌కు 127 గరుడ వాహనాలపై నిర్వహించిన దివ్యభవ్య గరుడ సేవ ఆద్యంతం అంగరంగ వైభవంగా సాగింది. గుడిమెళ్ల శ్రీని వాస శ్రీకరస్వామి ఆధ్వర్యంలో ఊరేగింపులో త్రిదండి రామచంద్రరామానుజ జీయర్ స్వామి, త్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామి, త్రిదండి బృందావన జీయర్ స్వామి, త్రిదండి శఠగోపముని జీయర్ స్వాములు వందలాది భక్తులు వెంటరాగా గరుడ సేవ నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సాగిన ఈ గరుడ సేవతో మచిలీపట్నంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు గరుడసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యతిరాజ భవనం వద్ద దయాకుంభ్ స్థలంలో త్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామి అనుగ్రహభాషనం చేశారు. పలువురు జిల్లా అధికారులు, వారి సతీమణులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి : కలెక్టర్ బాలాజీ

జిల్లా ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అందుకు లక్ష్మీనారాయణులను అర్చించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆకాంక్షించారు. శనివారం రాత్రి దయాకుంబ్ ఉత్సవంలో కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అని అందరికీ ఆశీస్సులు అందచేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రత్యేక అర్చనల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆసుపత్రిలో విజయవంతంగా రీడో వాల్వ్ సర్జరీ



రోగితో ఆసుపత్రి వైద్యులు

పెనమలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో సంక్లిష్ట రీడో వాల్వ్ చికిత్స విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఘంటసాలకు చెందిన లక్ష్మికి 17సంవత్సరాల వయస్సులో గాంధీ ఆసుపత్రిలో గుండెకు సంబంధించి మొదటి వాల్వ్ సర్జరీ జరగ్గా.. 28ఏళ్ల వయస్సులో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో రెండో వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది. మళ్లీ 39 ఏళ్ల వయస్సులో ప్రొస్థెటిక్ వాల్వ్ క్షీణత కారణంగా తీవ్రమైన శ్వాస సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె పోరంకిలోని క్యాపిటల్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు వీఎస్ఆర్ భూపాల్, డాక్టర్ హేమ కృష్ణ సాయిల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద విజయవంతంగా శనివారం సర్జరీ నిర్వహించారు.

ప్రజలకు శుద్ధమైన నీరు లక్ష్యం

- ఎంపీ బాలశౌరి హామీ
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు



యండపల్లిలో వంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను, మార్చి 15 : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రతి ఇంటికి శుద్ధమైన నీటిని అందించటమే నా ముందున్న ధ్యేయమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌లు మండలంలో పర్యటించారు. మునిపెడ, నీలిపూడి గ్రామాల్లో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిధుల నుంచి ఒక్కొక్కటి 15 లక్షల వ్యయంతో నిర్మించిన మైక్రో ఫిల్టర్ బెడ్‌లను ప్రారంభించారు. దాని పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీలిపూడిలో 20 లక్షల వ్యయంతో ఎంపీ నిధులతో నిర్మించిన వంతెనను, మరో 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. యండపల్లిలో 75 లక్షల ఎంపీ నిధులతో ప్రధాన పంటకాలువపై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణజిల్లాలో ప్రజలు తాగేందుకు స్వచ్ఛమైన నదీజలాలను ఐదేళ్లలో అందిస్తామన్నారు. కాగిత, వ్యాస్‌లు మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోదీ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షం కానుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. యండపల్లిలో ఎంపీ బాలశౌరి ప్రసంగం జనసైనికుల్లో ఉత్తేజం నింపింది. 'నా పేరు వల్లభనేని బాలశౌరి, నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా' అనడంతో జనసైనికులంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. గత ప్రభుత్వంలో బటన్ నొక్కే ముఖ్యమంత్రి నిధులు ఇవ్వకపోవటంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. బటన్ నొక్కే జగన్‌కు బాయ్ చెప్పి, జనసైనికులు మంచిపనిచేసారన్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లి రాష్ట్రానికే ఆదర్శం

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ



సర్పంచ్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న బాలాజీ

చల్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతలో స్వచ్ఛ సుందర చల్లపల్లి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, చల్లపల్లి గ్రామాన్ని జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చల్లపల్లిలో తెల్లవారుజామున స్వచ్ఛసేవలో కలెక్టర్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో కలెక్టర్ చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీ దుకాణాల్లో గాజుగ్లాసులనే వినియోగించాలని సూచించారు.

క్యారీబ్యాగ్ రహితంగా తీర్చిదిద్దాలి

స్వచ్ఛ కార్యక్రమాలతో చల్లపల్లి గుర్తింపు సాధించిందనీ, ఇందుకు నాయకత్వం వహించిన డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులను అభినందించారు. చల్లపల్లిలో చెత్త సేకరణ పద్ధతిని అభినందిస్తూ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పీవీ.మాధవేంద్రరావులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నెలరోజుల్లో క్యారీబ్యాగ్ రహిత గ్రామంగా చల్లపల్లిని తయారుచేయాలన్నారు. ఎంపీడీవో ఏవీ. రమణ, ఈవోఆర్డీ రవిశంకర్, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య!



గుడివాడ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందుల కారణంగా దొండపాడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గంటా శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుడివాడలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. దంపతులైన గంటా శ్రీనివాసరావు గుడివాడ రూరల్ మండలం దొండపాడులో, శ్రావణి గన్నవరంలో పనిచేస్తున్నారు. గ్రామ పరిధిలో శ్రీనివాసరావుకు మంచి పేరుంది. తండ్రి వ్యాపారంలో నష్టాలు రావడంతో శ్రీనివాసరావు అప్పులు ఎక్కువగా చేశాడని, సన్నిహితులు పేర్కొంటున్నారు. అప్పుల విషయంలో భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో నాటి నుంచి ఇద్దరు విడివిడిగా జీవిస్తున్నారు. శుక్రవారం టిడ్కో గృహాల పక్కనే ఉన్న రైలు ట్రాక్ వద్ద శ్రీనివాసరావు శవమై ఉండటంతో రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్యభర్తలు విడిపోవడానికి ముఖ్యంగా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రధాన అనుచరుడి హస్తమున్నట్టు ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

మిగులుతో దిగులు

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి వస్తోంది. ఈవోలపై తీవ్ర పనిభారం పడుతోంది. గ్రామ కార్యదర్శులు లేకపోవటం వల్ల పంచాయతీలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే, మిగిలిన కొన్ని ప్రభుత్వ శాఖల్లో కూడా ఖాళీ పోస్టులను భర్తీచేసే అవకాశం ఉంటుంది.

వీఆర్వోల అంగీకారంతో ఖాళీలు భర్తీ చేయండి

- జి.అనుపమ, ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలను ఇతర శాఖలకు బదలాయించే విషయంలో వారి నుంచి ప్రభుత్వం అంగీకారం తీసుకోవాలి. ఇతర శాఖలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్న వారిని నిరభ్యంతరంగా ఆయా శాఖలకు వాడుకోవచ్చు. అంగీకారం తెలపని వారిని.. రెవెన్యూలో విభాగంలోని ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలి. కోర్టు కేసుల గురించి పక్కన పెడితే, సీసీఎల్ఏ తాజా ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని వాటిని భర్తీ చేసే వరకు మిగులు వీఆర్వోలను కదిలించవద్దు. లేదంటే సచివాలయ వీఆర్వోలను రెవెన్యూతో అనుబంధమైన దేవదాయ శాఖ, సర్వే అండ్ ల్యాండ్స్, సివిల్ సప్లయిస్ వంటి శాఖల్లోకి పంపించాలి.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

(5వ పేజీ తరువాయి)

ముగ్గురే ఉన్నారని నందివాడ జెడ్పీటీసీ సభ్యురాలు కందుల లక్ష్మీదుర్గాకుమారి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కుదరవల్లి పాఠశాలలో చదివే పిల్లలు కొంతమందికి నేటికీ ఆధార్‌కార్డులు లేవన్నారు. పలు మండలాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మూగ, చెవుడు ఉన్న బాలలకు పాఠాలు బోధించే టీచర్లు, సౌకర్యాలు లేకపోవడంతో వారు చదువుకోలేని స్థితి ఏర్పడిందన్నారు. నూజివీడు మండల కేంద్రంలో 16 మంది పిల్లలు చదువుకు దూరమయ్యారని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు గుడిమళ్ల కృష్ణంరాజు అధికారులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పాఠాలు బోధించేందుకు టీచర్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకోసం తగు చర్యలు తీసుకోవాలని జెడ్పీ ఛైర్‌పర్సన్.. విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈవో రామారావు మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలల్లో 50 నుంచి 60 మంది పిల్లలు ఉంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి అక్కడ ఐదుగురు టీచర్లు ఉంటారని, తక్కువ పిల్లలున్న పాఠశాలలను కిలోమీటరు దూరంలోని పాఠశాలల్లో విలీనం చేస్తామన్నారు. జెడ్పీ సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే బాధ్యతను టీచర్లు కూడా తీసుకోవాలన్నారు.

పశు సంపదను కాపాడండి

ఏడాదిలోపు వయసున్న దూడలకు శరీరంపై బొబ్బలు వచ్చి చనిపోతున్నాయని, ఈ అంశంపై పశుసంవర్థక శాఖ అధికారులు దృష్టిసారించి అవసరమైన టీకాలు, వైద్యం అందించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. పశువులు అంటువ్యాధులు, రోగాల బారిన పడితే తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వైద్యసేవలను అందుబాటులోకి తేవాలన్నారు. చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ఇచ్చే జీవనభృతిని సకాలంలో అందించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలని గృహనిర్మాణ సంస్థ అధికారులకు జెడ్పీ ఛైర్‌పర్సన్ సూచించారు.

గూడూరు సీహెచ్‌సీపై దృష్టిపెట్టండి

వైద్యశాఖపై సమీక్ష జరిగిన సమయంలో.. గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ మాట్లాడుతూ పెడన నియోజకవర్గం గూడూరులో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి పక్కనే రూ.4 కోట్లతో ప్రభుత్వం సమీకృత ఆసుపత్రిని నిర్మించిందని, ఈ ఆసుపత్రికి గతంలో రోజుకు కనీసం 150 మంది రోగులు వచ్చేవారని, ప్రస్తుతం 50 మంది కూడా రావట్లేదన్నారు. వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరారు. వివిధ శాఖలపై సమీక్షలో భాగంగా చేనేత కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు, చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే వారికి ముద్రరుణాలు ఇచ్చేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, వ్యవసాయశాఖ జేడీ మనోహరరావు, చేనేత జౌళిశాఖ జేడీ సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై రియల్ ఆశలు

(5వ పేజీ తరువాయి)

చూస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో ఉంటున్న పలు రియల్ ఎస్టేట్ సంస్థలు విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన బిల్డర్లతో తరచూ సంప్రదింపులు చేయటం ఓఆర్ఆర్‌పై వారికున్న ఆసక్తిని తెలియజేస్తోంది. దీంతో వీరంతా భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నారు. నగరంలోని పలువురు బిల్డర్లతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడిన సందర్భంలో ఇతర రాష్ట్రాల బిల్డర్ల ఆసక్తి వెలుగులోకి వచ్చింది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు.. దేశంలోని అనేక ఎకనమిక్ కారిడార్లతో పాటు నూతన రాజధానికి అనుసంధానం కావటం వల్ల రియల్ ఎస్టేట్ వృద్ధి చెందుతుంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అవాంతరాలు లేకపోయినప్పటికీ ఎప్పటికి కార్యరూపంలోకి వస్తుందో అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ అవుటర్ అలైన్‌మెంట్ పరిధిలో ఇప్పుడిప్పుడే భూముల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందినవారు వెంచర్లు, నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా ఆలోచనలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అవుటర్ రింగ్ రోడ్డు వచ్చాక భారీస్థాయిలో అభివృద్ధి జరిగింది. అనేక రాష్ట్రాల నుంచి రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు వచ్చి పెట్టుబడులు పెట్టారు. అదే తరహాలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుపై పొరుగు రాష్ట్రాల సంస్థలు ఆసక్తి చూపించటం మంచి పరిణామంగానే చెప్పుకోవచ్చు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

జాబ్‌మేళాలో 115 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

ఉయ్యూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళా శాలలో శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలలో 115 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, కురా కు ఫైనాన్సియల్ సర్వీసెస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారు. ఉపాధి అధికారి డి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభి వృద్ధి అధికారి పి నరేశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

మందులతోనే హెచ్‌ఐవీ నియంత్రణ

గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ మౌనిక అన్నారు. స్థానిక బీసీ కల్యాణ మండపంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పీఎల్‌హెచ్‌ఐవీ నెట్‌వర్క్ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, శ్రీనివాసరావు, జ్యోతి, కవిత, కృష్ణ, రాకేష్, సదాలక్ష్మి పాల్గొన్నారు.

వెబ్ డిజైనింగ్‌లో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం వెబ్ డిజైనింగ్ ప్రోగ్రామ్‌లో బాగంగా కోడింగ్ హంట్ ఈవెంట్ నిర్వహించారు. కంప్యూటర్ ఇంజనీరింగ్ బ్రాంచ్ అధిపతి పల్లపోతు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ వెంట్ నిర్వహించారు. అడ్వాన్స్ కోడింగ్ అవకాశం కల్పించిన కళాశాల కరస్పాండెంట్ సూరపనేని వెంకట రమణ, ప్రెసిడెంట్ జ్యోతిలను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏవో పలసపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

కేసరపల్లిలో బోర్‌వెల్ నిర్మాణ పనులు ప్రారంభం

గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అన్నారు. మండలంలోని కేసరపల్లి నగర్లపేటలో రూ.4లక్షలతో ఏర్పాటు చేస్తున్న బోర్‌వెల్ నిర్మాణం, పైప్‌లైన్ పనులను శనివారం ప్రారంభించారు. సచివాలయ కార్యదర్శి భార్గవ్ సాయి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధు, గద్దం అంకాలు తదితరులు పాల్గొన్నారు.

మానవతలో అమరజీవి జయంతి

హనుమాన్‌జంక్షన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి తెలుగు వారందరికి శిరోధార్యమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వ రరావు అన్నారు. శనివారం మానవత కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మారుబోయిన పూలమాల వేసి నివాళులర్పించారు. మానవత సభ్యులు ఘంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, కొట్నేని రామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, నారగాని కొండలరావు, చెక్కా సుబ్బారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి

కలెక్టర్ డీకే బాలాజీ

ఉయ్యూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : హానికరమైన ప్లాస్టిక్ వాడకంకు స్వస్తి పలికి నార సంచులు, క్లాత్ బ్యాగ్స్ వినియోగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పెదఓగిరాలలో శనివారం పర్యటించి తడి పొడి చెత్త సేకరణ పరిశీలించి గ్రామంలో పారిశుధ్య పనులు తనిఖీ చేశారు. ఉద్యోగులు, గ్రామ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. డీపీవో అరుణ, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి జ్యోతి, సర్పంచ్ టి. లక్ష్మి పాల్గొన్నారు.

● గండిగుంట పంచాయతీ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో కూరగాయల దుకాణం వద్ద గుడ్డ సంచులు పంపిణీ చేసి, ప్లాస్టిక్ వాడకం మంచిది కాదని అవగాహన కల్పించారు.




పెదఓగిరాలలో స్వచ్ఛ ఆంధ్ర దివస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ బాలాజీ.. పెనమలూరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెనమలూరు : పరిసరాల పరిశుభ్రత పాటించాలని దీంతో ఆరోగ్యం బాగుంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శనివారం పెనమలూరు ఉన్నత పాఠశాలలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత గురించిన జాగ్రత్తలు అలవరచుకోవాలని, వారికి ఉపాధ్యాయులు తగు సూచనలు చేసి వారిని పరిశుభ్రత పట్ల చైతన్యవంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రణవి, సర్పంచి లింగాల భాస్కరరావు, పెనమలూరు టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, సంగెపు రంగారావు, కిలారు శివకుమార్ పాల్గొన్నారు.



కంకిపాడు బస్టాండ్ సెంటర్లో ..

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

కంకిపాడు : గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె. అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కంకిపాడు బస్టాండ్‌లో చీపిరి పట్టి ఊడ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పారిశుధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సంపత్ కుమారి, ఈవోఆర్డీ కిరణ్మయి, ఈవో సాంబశివరావు, పంచాయతీ రాజ్ శానటరి ఇన్‌స్పెక్టర్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ సూర్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● మండల వ్యవసాయ శాఖ అధికారి పి. మాధురి కిరణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

● పర్యావరణాన్ని మనం కాపాడితే...రానున్న భవిష్యత్ తరాలను పర్యావరణం కాపాడుతుందని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) చైర్మన్ బోయిన రోహిణి కుమారి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సంజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చలవాది రాజా, గరికిపాటి రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

గన్నవరం : ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. మండలంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి షాపులకు వెళ్లి ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. పంచాయితీ కార్యదర్శి చెన్నకేశవులు, హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు. కేసరపల్లి, బుద్ధవరం, ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి.



బాపులపాడులో ర్యాలీ

ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ : పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్న క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర దివస్ బాపులపాడు పంచాయతీ కార్యా లయంలో నిర్వహించారు. కార్యదర్శి అంజన అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. లక్ష్మయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సాయిప్రకాష్‌నాథ్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శుల ఆధ్వర్యంలో శానిటేషన్, ప్లాస్టిక్ నివారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నేషనల్ హైవే రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్

సర్వీస్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

గన్నవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపాలెం రైల్వే గేటు సమీపంలో బైపాస్‌కు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు శనివారం పరిశీలన చేశారు. మర్లపాలెంతో పాటు మెట్లపల్లి, తెంపల్లి, వీరపనేనిగూడెం, బల్లిపర్రు గ్రామాల ప్రజల సౌకర్యార్థం చిన అవుటపల్లి-కాజా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రామస్తులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో విన్నవించుకున్నారు. స్పందించిన నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సానుకూలంగా స్పందించింది. ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్ అధికారులతో కలసి మర్లపాలెం గ్రామ సమీపంలోని రైలేగేటు వద్దకు వచ్చారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సాధ్య సాధ్యాలను పరిశీలించారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా బైపాస్ రోడ్డుకు కనెక్టివిటీ అయ్యే విధంగా సర్వీస్ రోడ్డు నిర్మాణంపై ఎంత భూమి అవసరమో, ఆ సర్వే నెంబర్‌లు చూసి రైతులతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. నేష నల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ లత, మెగా సంస్థ పీఎం భరత్, సీనియర్ మేనేజర్ రమ బాజీ, స్థానికులు కంభంపాటి హేమంత్ కోటేశ్వర రావు, చిగురుపాటి కుమార స్వామి, జాస్తి మురళీకృష్ణ, కంభంపాటి కృష్ణ కిషోర్, రాజా పాల్గొన్నారు.

కఠోర పరిశ్రమతోనే విజయం

ఏపీ ఫైర్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ మురళీమోహన్

పెనమలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కఠోర పరిశ్రమ విద్యార్థుల ఆయుధమైతే విజయం బానిసవుతుందని ఏపీ ఫైర్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ మురళీమోహన్ తెలిపారు. శనివారం పోరంకి భాష్యం బ్లూమ్స్ పాఠశాల మూడవ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మురళీమోహన్ మాట్లాడుతూ కార్యసాధకులు లక్ష్యసాధనలో గమ్యాన్ని మాత్రమే చూస్తారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల మనసెరిగి నడుచుకొంటూ వారు ఏరంగాల్లో తమ ఆసక్తిని కనబరుస్తున్నారో గ్రహించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, ఐబీటీ ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్, జడ్‌ఈవో వరలక్ష్మి, జడ్‌వో జోషి, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఫైర్‌శాఖ అధికారి మురళీమోహన్

జంక్షన్ పీఎస్‌కు చేరిన పది పరీక్షా పత్రాలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలకు సంబంధించి పరీక్షాపత్రాలు జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలో బాపు లపాడు, వేలేరు, ఆరుగొలను, కానుమోలు జడ్పీ హైస్కూల్స్, జంక్షన్ సాయిగౌతమ్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఐదు పరీక్షా కేంద్రాలకు అవసరమైన పరీక్షా పత్రాలు జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. శుక్రవారం సెట్-1, శనివారం సెట్-2 పత్రాలు వచ్చాయి. వాటిని కస్టోడియన్ ఆఫీసర్ టీవీ నాగేశ్వరరావు పరిశీ లించి ఆయా కేంద్రాల వారీగా పరీక్షా పత్రాలను భద్రపరిచారు. కాగా వీరవల్లి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి అవసరమైన పరీక్షా పత్రాలు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. మొత్తం ఆరు కేంద్రాల్లో 960 మంది పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మండల సమావేశంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని

ఉంగుటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పనిచేసి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన స్థానిక స్త్రీశక్తి భవనం మీటింగ్ హాలులో శనివారం సాయంత్రం జరిగింది. అధికారులు తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు. వీటిపై ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో వున్న పనులు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వంటి అంశాలపై అధికారులను నిలదీశారు. ఉపాధిహామీ పనుల్లో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ స్థానంలో కొత్త ఎఫ్‌ఏను ఎప్పుడు నియమిస్తారంటూ గారపాడు సర్పంచ్ కొడాలి సుకన్య అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి చెరువు మరమ్మతుల కోసం మంజూరైన రూ. 1.70 లక్షలతో పనులు పూర్తిచేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఏలూరు కాలువకు ఉపకాలువలుగా వున్న పలు పంటకాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా జరగక ఆయా కాలువల చివరి పొలాలకు నీరందక ఏటా దిగువ ప్రాంత రైతులు నష్టపోతున్నారని ఈ వేసవిలోనైనా పంట కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్ అధికారులకు విన్నవించారు. కాగా వెన్నూతల, వెల్దిపాడు, మధిరపాడు తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలంటూ ఆయాగ్రామాల సర్పంచ్‌లు సభలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ కొట్నాని చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోకో ధర ఢమాల్!

సగానికి పైగా పడిపోయిన రేటు ● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కోకో రైతులకు కోలుకోలేని షాక్ తగిలింది. ఈ ఏడాది కనీస గిట్టుబాటు ధర కూడా దక్కని విధంగా ధరలు పడిపోయాయి. దీంతో కోకో సాగుచేస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇతర దేశాల్లో కోకో గింజలు చౌకగా వస్తున్నాయని అవసరాలకు మించి కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకోవడంతో స్థానికంగా సాగు చేసే తమకు ధర అందటం లేదని రైతులు వాపోతున్నారు. మద్దతు ధర లేకపోవడంతో కొందరు రైతులు చెట్లపైనే కాపునకు వచ్చిన కాయలను వదిలేస్తుంటే మరి కొందరు అయినకాడికి దళారులకు అమ్మి నష్టపోతున్నారు.
- ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్



కోకో పంట మన రాష్ట్రంలో కృష్ణా, ఏలూరు, ఉభయగోదావరి, మన్యం జిల్లాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేస్తుండగా, కృష్ణాజిల్లాలో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా సాగు చేస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఏటా సుమారు 13వేల టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. కోకో గింజల ఉత్పత్తిలో దేశంలోనే మొదటిస్థానంలో మన రాష్ట్రం ఉన్నా గిట్టుబాటు ధర కోసం రైతులు దిక్కులు చూడాల్సి వస్తోంది. కోకో గింజలు ప్రధానంగా చాక్లెట్లు, కేక్ తయారీలో ఎక్కువగా వాడుతుంటారు. సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చాక్లెట్ ఫ్యాక్టరీల లాంటివి స్థాపించడంతో పాటు మల్లవల్లి పారిశ్రామికవాడలోని సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే అక్కడే ఉన్న చాక్లెట్ ఫ్యాక్టరీలతో పాటు పార్లే వంటి పెద్ద ఫ్యాక్టరీలకు కూడా సరఫరా చేయవచ్చని రైతులు సూచిస్తున్నారు. కోకో సాధారణంగా ఏడాదికి రెండు పంటలిస్తుంది. నవంబర్ నుంచి జూన్, జూలై నుంచి అక్టోబర్ వరకూ పంట చేతికి వస్తుంది. గత ఏడాది కిలో రూ.900 ఉన్న ధర, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.550 పడిపోయిందని దీంతో కోతకొచ్చినా కూలీ ధర కూడా చెల్లించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళారుల సిండికేట్

కంపెనీల గుత్తాధిపత్యం వల్ల అంతర్జాతీయ మార్కెట్ మాయాజాలంతో రైతులు చిత్తవుతున్నారు. దేశీయంగా 1.10 టన్నుల కోకో గింజలు అవసరముండగా దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతుంది కేవలం 35 వేల టన్నులు (32శాతం) మాత్రమే. మిగిలిదంతా దిగుమతి చేసుకుంటున్నాం. అయినా కోకో గింజల రేట్లు మాత్రం దిగజారిపోతోంది. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో మాత్రమే కోకో సాగు అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా మన రాష్ట్రం 35శాతం ఉత్పత్తి చేస్తోందని అంచనా. దేశీయంగానే కాక విదేశాల్లోనూ చాక్లెట్ వాడకంతో పాటు డార్క్ చాక్లెట్ వినియోగం పెరిగి డిమాండ్ పెరిగినా రైతులకిచ్చే ధర మాత్రం పడిపోయింది. కోకోలో ప్రధాన సమస్య పర్మెంటేషన్.. అంటే పులియబెట్టడం, ఎండబెట్టడంలోనే ఉంది. ఎండబెట్టడంలో తేడా వస్తే గింజలు నల్లబడిపోతాయి. చాక్లెట్‌పొడికి మంచి వాసన, రుచి రాదు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి రాదు. నిలువ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. నిలువకు నాణ్యతా ప్రమాణాలున్న వసతి అవసరం.



కౌలు రైతుకు మరింత నష్టం: బెజవాడ శ్రీనివాసరావు, రైతు

కోకో సాగులో కౌలు రైతులు ఎక్కువగా ఉండటంతో నష్టపోతున్నారు. ఆయిల్ పామ్‌లో సాగుచేసిన కోకోపంటకు ఎకరానికి రూ.25వేలు కౌలు చెల్లిస్తుంటే, కొబ్బరిలో సాగు చేసిన కోకోకు ఎకరానికి రూ.30వేల వరకూ కౌలు చెల్లిస్తున్నామని రైతులు వివరించారు. ఆయిల్‌పామ్‌లో సాగుచేసిన కోకోపంట 2 క్వింటాళ్ల వరకూ, కొబ్బరిలో సాగు చేసిన కోకో పంట 4 నుంచి 5 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. కౌలు కాక ఎకరానికి రూ.30వేల వరకూ ఖర్చవుతుంది. గత ఏడాది కోకో పంటకు మంచి ధర పలకడంతో మరిన్ని ఎకరాలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లేదు సరికదా పెట్టుబడి ఖర్చులు రావడంలేదని బెజవాడ శ్రీనివాసరావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సహకారం అవసరం

పెరిగిన సాంకేతిన పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి. సిండికేట్‌గా ఏర్పడి రైతు కష్టాన్ని దోచుకుంటున్న దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలి. దిగుమతులను తగ్గిస్తూ స్థానిక పంటను కొనుగోలు చేయాలి. కోకో గింజలను కొనుగోలు చేసే కంపెనీ ప్రతినిధులతో, రైతులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి రైతుకు న్యాయం చేయాలి. కోకో ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు, పొదుపు సంఘాలను, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి ఇంటివద్దే చాక్లెట్ల తయారీకి ప్రోత్సహించవచ్చు. దీంతో యువతకు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. గింజలను పులియబెట్టడం, ఎండబెట్టడంతో పాటు పొడి చేసేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణను రైతులకిస్తూ పరికరాలను అందుబాటులోకి తేవాలి. ఉద్యానవనశాఖ కోకో పంటను ప్రోత్సహించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేసేలా కోకోబోర్డు ఏర్పాటు ప్రాధాన్యత గురించి పరిశీలించాలి.



ఘనంగా 'సురభి' ప్రారంభం

విజయవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సురభి నాటక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆడిటోరియంలో 6 రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలిరోజు భక్తప్రహ్లాద నాటకాన్ని శనివారం ప్రదర్శించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం (ఎస్‌జడ్‌సీసీ, తంజావూరు), రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నారు.

రక్తి కట్టిన భక్త ప్రహ్లాద

140 ఏళ్ల ప్రస్థానం కలిగిన సురభి నాటక సంస్థ ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం సంప్రదాయ రంగస్థల కళలను, ప్రత్యేక ఎఫెక్టులను, సంగీతాన్ని, పద్యాలను కలిగి ప్రేక్షకులకు మహదానందాన్ని కలిగించింది. భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన రంగస్థలంపై ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. రాజ్యసభ, నరసింహుడి అవతారం వంటి కీలక ఘట్టాలు కనువిందు చేశాయి. ప్రహ్లాద భక్తిని, హిరణ్యకశ్యపుని అహంకారాన్ని, నరసింహ స్వామి ప్రతాపాన్ని చూపిస్తూ నటులు పాత్రలకు ప్రాణం పోశారు. శ్లోకాలు, హరిభజనలు, నాటకీయ సంభాషణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రత్యేక లైటింగ్ ఎఫెక్ట్స్, భయానక శబ్దాలు, ఆహ్లాదకరమైన నేపథ్య సంగీతం ద్వారా నరసింహస్వామి అవతార ఘట్టాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. ప్రహ్లాదుడిగా అన్సికా వర్మ, పర్నికా వర్మలు, హిరణ్యకశ్యపునిగా జయచంద్ర వర్మ, లీలావతిగా కేతశ్రీ ప్రధాన పాత్రలు పోషించారు. హారికవర్మ, రవివర్మ, పద్మజ వర్మ, హేమమానస, ఉపేంద్ర, రిషిక, లేఖజ్‌లు తమ పాత్రలతో రక్తి కట్టించారు. కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు, మాధవి పురాణం, ప్రోగ్రాం అధికారి రంగ భాష్యం పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విధానాలనే అవలంభిస్తున్న కూటమి

● కేఎస్ లక్ష్మణరావు

గాంధీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో మార్పుల పేరుతో విద్యార్థులకు విద్యను దూరం చేసిందని కేఎస్ లక్ష్మణరావు మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకే పీ4 విధానాన్ని ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. దీంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందని, ప్రజలకు ఉచిత వైద్యం అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటంతోనే విద్యరంగంలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాటాలకు తమ మద్దతు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కుమార్, ఎ.అశోక్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన చలో విజయవాడ సందర్భంగా ఇచ్చిన హామీలను నేటి వరకు ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రూ.5వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకాయిలు తక్షణమే చెల్లించాలని, జీవో77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కామన్ సెట్ రద్దు చేసి గతంలో మాదిరిగా ఏ విశ్వవిద్యాలయానికి ఆ విశ్వవిద్యాలయం సెట్ నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీఎస్, రైతు సంఘం నేతలు అంద్ర మాల్యాద్రి, వై.కేశవరావు, హరిబాబు, పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ నేతలు రాజేష్, మహేష్ వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు ఈ దీక్షకు మద్దతు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.వినోద్, ఎం.కిరణ్, సీహెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

నీటి కాలుష్యం తగ్గించండి

● కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి కాలుష్యం నివారణకు మైక్రోబియల్ బయోరిమిడియేషన్ విధానాన్ని అవలంభించాలని కాంగ్రెస్ నేతల బృందం కలెక్టర్ లక్ష్మీశను కోరింది. హైదరాబాద్‌లో ఈ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని వివరించింది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్, డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.గురునాథం, నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితరులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో శనివారం కలిశారు. నీటి కాలుష్యం తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు మరో రెండు అంశాలపై కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాలను అందజేశారు.

రైతు సమస్యల్ని గడువులోపు పరిష్కరించాలి

● అధికారులకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఆదేశం

బెంజిసర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ పరిధిలో రైతు సమస్యల పరిష్కారం పూర్తిగా వారి సంతృప్తి చెందేలా ఉండాలని కమిషనర్ కె.కన్నబాబు అన్నారు. అదనపు కమిషనర్ జీ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలిసి ఆయన శనివారం నగరంలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ నమోదు చేసిన రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఒకపక్క రైతు సమస్యలు తెలుసుకుంటూనే మరోవైపు అధికారులతో చర్చించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టల్‌లో 93 సమస్యలు నమోదవగా రైతులందరినీ పిలిచి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం తుళ్లూరులో జరిగే గ్రీవెన్స్‌డేతోపాటు ప్రతి శనివారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో స్వయంగా తానే సమీక్షా సమవేశం నిర్వహిస్తానన్నారు. రైతుల నుంచి నేరుగానే కాకుండా ఆన్‌లైన్‌ఓనూ ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి పరిష్కారమయ్యే వరకు రైతుల ఫోన్‌లకు మెసేజ్ వెళుతుందన్నారు. పలువురు రైతులు గ్రామకంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్యతాక్రమంలో వీలైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. రైతులు ఎక్కువగా రిటర్నబుల్ ప్లాట్లు, కౌలు చెల్లింపు, సీఆర్‌డీఏ పింఛన్ వంటి అంశాలపై తమ సమస్యలను విన్నవించారు. సీఆర్‌డీఏ ల్యాండ్స్ అండ్ ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు..

ఒడిశా యువతికి క్లిష్టమైన గుండె చికిత్స

● అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్



ఒడిశా యువతితో కుటుంబ సభ్యులు, హాస్పిటల్ వైద్యులు

ప్రభుత్వాసుపత్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లాకి చెందిన జెనా (26) అనే యువతికి విజయవాడ ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారు మూడు రకాలైన క్లిష్టతరమైన గుండె శస్త్రచికిత్సలు చేసి కొత్త జీవితాన్ని అందించారు. ఈసందర్భంగా శనివారం హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ వాసుదేవ్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌కు వచ్చిన జెనాకు మూడు రకాలైన గుండె సమస్యలను గుర్తించామని శస్త్ర చికిత్స ద్వారా సరి చేయగలమని నిర్ధారించి శస్త్ర చికిత్సకు తీసుకున్నట్లు చెప్పారు. సీనియర్ గుండె శస్త్ర చికిత్సా వైద్య నిపుణులు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ ఆధ్వర్యంలో నిష్ణాతులైన అనస్థీషియా వైద్య బృందం ఆధ్వర్యంలో సెన్నింగ్ రిపేర్ (ఏట్రియల్ స్విచ్), కరెక్టడ్ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్ సమస్యలో గుండె రక్త ప్రవాహ మార్గాలు తప్పుగా అనుసంధానమై ఉన్న సమస్యకు శస్త్ర చికిత్స ద్వారా గుండె లోపల వెంట్రికల్ నుంచి అయోర్టా బాఫుల్ రిపేర్ ఎడమ గుండె గది (ఎల్‌వీ) నుంచి అయోర్టాకు రక్త ప్రవాహం సరిగ్గా లేకపోవడంతో రోగికి ఆక్సిజన్ ఉన్నా రక్తం శరీరానికి తగినంతగా వెళ్లకపోవడంతో బాఫుల్ టన్నెల్ లాంటి మార్గం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైట్ వెంట్రికల్ నుంచి పల్మనరీ ఆర్టరీ కాండుయిట్ రిపేర్ ఆర్వీ టు పీఏ కండుయిట్ రీపేరట్ కుడివైపు గుండె గది (ఆర్‌వీ) నుంచి ఊపిరితిత్తులకు (పీఏ) రక్తం సరైన విధంగా వెళ్లకపోవడంతో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందడం లేదని ఆర్‌వీ, పీఏ మధ్య ఒక కృత్రిమ పైపు (కండుయిట్ - ట్యూబ్)ను అమర్చి రక్త ప్రవాహాన్ని మెరుగుపరిచినట్టు చెప్పారు. చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వైద్య బృందాన్ని అభినందిస్తూ క్లిష్టతరమైన ఈ శస్త్రచికిత్సకు 12 గంటలు సమయం పట్టిందన్నారు. దేశంలోనే ఇటువంటి అరుదుగా జరుగుతాయని తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి చికిత్స మొదటి సారిగా నిర్వహించినట్టు చెప్పారు. డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ కె.అనూష, గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ, జనరల్ మేనేజర్ డాక్టర్ సుమ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వసంత నాగేశ్వరరావు, రచయిత రామదాసప్పనాయుడు

'సక్సెస్ పోలీస్' పుస్తకావిష్కరణ

గాంధీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు నీతి, నిజాయితీతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పలువురు వక్తలు ప్రశంసించారు. అమరావతి డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఛైర్మన్ తిప్పినేని రామదాసప్పనాయుడు రాసిన 'సక్సెస్ పోలీస్' పుస్తకావిష్కరణ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రాద్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ద్వారకా తిరుమలరావు జీవిత చరిత్రపై రాసిన ఈ పుస్తకంలో ఆయన విధి నిర్వహణలో వ్యవహరించిన తీరుతో పాటు అనేక మంది ఐపీఎస్ అధికారుల పనితీరును రచయిత వివరించిన తీరును వక్తలు అభినందించారు. నిజాయితీ పోలీస్ అధికారుల సమర్థతను మెచ్చుకుంటూనే అవినీతి పోలీస్ అధికారుల వ్యవహారశైలిని ఎండగట్టారన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వినియోగదారుల పరిరక్షణ చట్టం-ప్రజా చైతన్యం' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ చట్టం వివరాలను రాజేంద్రప్రసాద్ వివరించారు. ప్రజా చైతన్యంతోనే చట్టాలకు సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం వసంత నాగేశ్వరరావు రచయిత రామదాసప్పనాయుడుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. రామదాసప్పనాయుడు మాట్లాడుతూ మావోయిస్టు కేంద్ర కమిటీ నుంచి బహిష్కరించబడిన హిడ్మా ఆధ్వర్యంలో మరో కొత్త మావోయిస్టు పార్టీ ఏర్పడబోతుందన్నారు. ఇతడికి రెండు ప్రముఖ రాజకీయ పార్టీలు తెలుగు రాష్ట్రాల్లో చేయూతనివ్వబోతున్నాయని, దీంతో రాజధాని అమరావతితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు బలమైన ముప్పు పొంచి ఉందని ఈ విషయాలను ఈ పుస్తకంలో పొందుపరచినట్టు పేర్కొన్నారు.




దుర్గగుడి కళావేదికపై సంగీతార్చనలో కీర్తనలు ఆలపిస్తున్న ప్రముఖ సంగీత విద్వాంసురాలు వనిత సురేష్

దుర్గమ్మకు సంగీతార్చన

ఇంద్రకీలాద్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సకల కళా ప్రియ కనక దుర్గమ్మకు శనివారం ఇంద్రకీలాద్రిపై సంగీతార్చన జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసురాలు వనిత సురేష్ గాత్ర కచేరితో భక్తులు పరవశించారు. సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గగుడి కళావేదిక కేంద్రంగా వనిత సురేష్ తమ బృందంతో గాత్ర కచేరీ నిర్వహించారు. మూడు గంటలపాటు జరిగిన ఈ కచేరీలో పలు అమ్మవారి కీర్తనలను హృద్యంగా ఆలపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ శాస్త్రీయ సంగీతంపై ఆసక్తితో 15ఏళ్లుగా దేశంలోని అనేక ప్రాంతాల్లో గాత్ర కచేరి ప్రదర్శనలు ఇస్తున్నానని వనిత సురేష్ తెలిపారు. తొలిసారిగా దుర్గమ్మ సన్నిధిలో స్వరార్చణ చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి, ఈవో కె.రామచంద్ర మోహన్‌కు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది రవికుమార్ తనయుడు మల్లాది శివానంద్ మృదంగంపై, కుమారి సింధు రాగేశ్వరి వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు. అనంతరం కళా బృందం అమ్మవారిని దర్శించుకోగా వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు వారికి అందజేశారు.

దాసాంజనేయస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి

గుణదల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయానికి హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వాదం అందించారు. ఈవో పాతూరి లోకేశ్వరి జడ్జి గోపాలకృష్ణకు దుశ్శాలువా కప్పి ఆంజనేయస్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు, మాచవరం ఎస్ఐ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి గోపాలకృష్ణకు చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఈవో

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

గంపలగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుకల్యాణం శుక్రవారం రాత్రి వేలాది భక్తుల నడుమ విద్యుత్ కాంతులతో నయనానందకరంగా జరిగింది. స్వామిని మేళతాళాలతో కల్యాణ మండపంలో ప్రవేశం చేయించారు. నిత్య హోమం బలిహరణ ముగించిన తరువాత రమణాచార్యులు ఆధ్వర్యంలో కన్యాదాన పీటలపై కూర్చున్న 260 మంది దంపతుల గోత్రనామాలు చదివించారు. ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ దంపతులు కన్యాదాన పీటలపై కూర్చున్నారు. వేద మంత్రాల నడుమ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కన్యాదానం పీటలపై కూర్చున్నవారికి ప్రత్యేక మెమోంటోలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణం అనంతరం స్వామిని గరుడ వాహనంపై ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సంధ్య, ఛైర్మన్ కావూరి శశిరేఖ, టీడీపీ నేతలు వనమా చిన్నబాబు, వడ్లమూడి రాజశేఖర్, బెల్లం మధు, పామర్తి కొండలరావు, సురేష్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ చిన్ని దంపతులు

ఎడ్ల పందేలు ప్రారంభం


నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పూటీ లాగుట ఎడ్ల పందేలను శనివారం సాయంత్రం కొల్లి కిరణ్, కొల్లి అజయ్ ప్రారంభించారు. టీడీపీ నేతలు వనమా చిన్నబాబు, ధారా రవికుమార్, సురేష్, మందా జమలయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ రథోత్సవం

పెనుగంచిప్రోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం రాత్రి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతమ్మ-గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి బయటకు తెచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఎక్కించి ఉత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. రథాన్ని గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ ఎద్దులతో లాగించి గ్రామోత్సవం నిర్వహించి రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగి అమ్మవారి ఆలయానికి చేర్చారు. భక్తులు రథానికి అడుగడుగున నీళ్లు వారపోసి టెంకాయలు, పూజా ద్రవ్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తహసీల్దార్ శాంతి లక్ష్మి, ఈఈ ఎల్.రమా, ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, పెద్ద ఎత్తున భక్తులు అధికారులు పాల్గొన్నారు. ముందుగా సోమవారం జరగనున్న తిరుపతమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవంపై ఏసీపీ తిలక్ వివిధ రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పుట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న ఈవో, ఛైర్మన్ శ్రీనివాసరావు, తహసీల్దార్ శాంతిలక్ష్మి



పీఎం ఉపాధి కల్పనలో మాట్లాడుతున్న కేవీఐసీ అధికారులు

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

బెంజిసర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా యువ పారిశ్రామికవేత్తలను వివిధ పథకాలకు రాయితీస్తూ ప్రోత్సహిస్తోందని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. నగరంలోని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పీఎం ఉపాధి కల్పనలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువ పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలతో నూతన పరిశ్రమలను స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించాలని కోరారు. కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. గ్రీస్, ఎ. ఆనంద్‌కుమార్, మహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ముగిసిన నాంచారమ్మ జాతర

మోపిదేవి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ అమ్మవారు శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రవేశం చేయడంతో వార్షిక జాతర మహోత్సవం వైభవంగా ముగిసింది. 15 రోజులపాటు అమ్మవారు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ భక్తుల పూజలు అందుకున్నారు. శుక్రవారం ప్రధాన జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



ఆలయ ప్రవేశం చేసిన అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మినపకాయ నూర్పిడి యంత్రం తిరగబడి
వ్యవసాయ మహిళా కూలీ మృతి

● ఆరుగురికి గాయాలు

మచిలీపట్నం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మినపకాయ నూర్పిడి యంత్రం తిరగబడి వ్యవసాయ మహిళా కూలీ మృతి చెందింది. ఆరుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన బందరు మండలం తుమ్మలచెరువు గ్రామంలో శనివారం జరిగింది. వాడగొయ్యికి చెందిన కొందరు మహిళలు వద్ద మినపకాయ నూర్పిడి పనులకు తుమ్మలచెరువుకు వెళ్లారు. పొలం పనులు చేసుకుని తిరిగి వస్తుండగా ట్రాక్టర్ వెనుక ఉన్న మినపకాయ నూర్పిడి యంత్రం తిరగబడింది. సింగారపు మంగమ్మ(45) మృతిచెందింది. ఆరుగురు మహిళలు గాయపడ్డారు. గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మచిలీపట్నం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్డులో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెంపుల్ కాలనీకి చెందిన అబ్దుల్ ఉస్మాన్(60) అక్కడికక్కడే మృతిచెందాడు. పోర్టు పనుల వద్ద రాళ్లు దింపి ఇబ్రహీంపట్నం వెళుతున్న టిప్పర్‌ను ద్విచక్ర వాహనంపై వస్తున్న అబ్దుల్ ఉస్మాన్ ఢీకొన్నాడు. దీంతో ఉస్మాన్ మృతి చెందాడు. డ్రైవర్ గోపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలపూడి సీఐ నబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ఘంటసాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తికి ఫిట్స్ రావటంతో కాలువలో పడి మృతి చెందిన విషాదకర ఘటన దేవరకోటలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కొడాలి డేవిడ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం గ్రామంలోని వంతెన వద్ద బహిర్భూమికి వెళ్లగా, ఆ సమయంలో ఫిట్స్ రావడంతో కాలువలో పడి ఊపిరాడక మృతి చెందాడు. స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిల్లీగ్రాహం నగర్‌లో బంగారం చోరీ

నాగాయలంక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్రచివర శివారు బిల్లీగ్రాహం నగర్‌లోని తన ఇంటిలోకి ఆగంతకులు చొరబడి విలువైన బంగారు వస్తువులు దొంగిలించుకుపోయారని కోన రంగబాబు శుక్రవారం ఫిర్యాదు చేశారని ఎస్సై కె.రాజేష్ తెలిపారు. రంగబాబు దంపతులు వలస కూలీలని, పనుల కోసం గరికపాడుకు గత నెల 16న వెళ్లి ఈ నెల 14న తమ ఇంటికి తిరిగి వచ్చారని ఎస్సై తెలిపారు. ఇంటి తలుపు పగులగొట్టి, బీరువాను పగులకొట్టి అందులో ఉన్న నానుతాడు, బంగారు చైను, నాలుగు బంగారు ఉంగరాలు రూ.80 వేలు విలువైన వస్తువులు చోరీ చేశారని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశామన్నారు. శనివారం క్లూస్ టీమ్‌ను ఘటనా స్థలికి తీసుకెళ్లి పరిశీలిస్తున్నట్లు రాజేష్ తెలిపారు.



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది



బల్లిపర్రులో వీధులు శుభ్రం చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



ఘంటసాలలో బౌద్ధ స్థూపం వద్ద పరిసరాలు శుభ్రం చేస్తున్న పర్యాటక శాఖ జిల్లా అధికారి రామ్‌లక్ష్మణ్



అవనిగడ్డలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజల స్వచ్ఛ ప్రతిజ్ఞ ● వాడవాడలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

మచిలీపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నీటి సీసాల వాడకాన్ని నిషేధిస్తున్నట్లు కలెక్టర్ బాలాజీ శనివారం ప్రకటించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ సీసాల వాడకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులకు, సిబ్బందికి స్టీల్ నీటి సీసాలను కలెక్టర్ అందజేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, మానవహారంగా ఏర్పడి ప్రదర్శన నిర్వహించారు. వివిధ విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో..

మచిలీపట్నం టౌన్: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఉపకులపతి రాంజీ, రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. కరగ్రహారంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా పాల్గొన్నారు. కానూరు సచివాలయంలో నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. కానూరు పాఠశాలలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ ఆశాలత ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పరిషత్‌లో సీఈవో కన్నమనాయుడు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, రంగనాయకస్వామి దేవాలయంలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆలయ ఈవో సమ్మెట అంజనేయస్వామి ఆధ్వర్యంలో భక్తులు చీపుళ్లు పట్టుకుని ఆలయాన్ని శుభ్రం చేశారు.

బల్లిపర్రులో..

పెడన రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలసి బల్లిపర్రు గ్రామ వీధుల్లో చెత్తను ఆయన తొలగించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలంటూ యర్రా సుబ్రహ్మణ్యేశ్వరరావు(చిన్న) వినతి పత్రం అందించారు. పంచకర్ల సురేష్, జోగి నాగ వరలక్ష్మి, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, వంశీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ: తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియకుమారి, ఎంపీపీ తుంగల సుమతిదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా తదితరులు ప్రధాన సెంటర్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరారు. ఈవోపీఆర్డీ అరుణ, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు. ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛత కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ జయకుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సురేంద్రనాథ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు కృష్ణకుమారి పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత, జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి పాఠశాల, కళాశాల ప్రాంగణాలను శుభ్రపరిచారు.

పులిగడ్డ, అశ్వారావుపాలెంలో..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డలో పంచాయతీ కార్యదర్శి అనిత, అశ్వారావుపాలెంలో సర్పంచ్ అంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిరోధిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దామనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అశ్వారావుపాలెంలో ఈవోపీఆర్డీ అరుణ కుమారి పాల్గొన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ముద్రించిన చేతి సంచులను పలువురికి అందజేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బౌద్ధస్థూపం వద్ద..

ఘంటసాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పర్యాటక శాఖ జిల్లా అధికారి రామ్ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఘంటసాలలో బౌద్ధ స్థూపం, మ్యూజియం పరిసరాలను పారిశుధ్య కార్మికులతో కలసి చీపురు పట్టి శుభ్రం చేశారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టి.జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలు, వ్యాపారులకు అవగాహన

నాగాయలంక: గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కైతేపల్లి అంకాలు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటంపై గ్రామ ప్రజలకు, వ్యాపారులకు, వెలుగు, ఉపాధి హామీ పథకం, ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించి మహిళలకు చెత్త బుట్టలను, సంచులు పంపిణీ చేశారు. మహిళలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, కె.వై.దాస్, టీపీఎన్ ముత్యాలు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు పాల్గొన్నారు.

కోడూరులో..

కోడూరు: తహసీల్దార్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లో క్యారీ బ్యాగ్‌లను ఏరి, పిచ్చి మొక్కలను తొలగించారు. రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐ సుభాషిణి, సర్పంచ్ వెన్నా షైనీ, పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

మోపిదేవి మండలంలో..

మోపిదేవి: మోపిదేవి, బొబ్బర్లంక, పెదప్రోలు, కె.కొత్తపాలెం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాల్లో పారిశుధ్య చర్యలు నిర్వహించారు. పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాల్లో కార్యాలయ ఆవరణను శుభ్రం చేసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ శ్రీరామ్ సాయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. దేవస్థానం ఈవో డి.శ్రీరామవర ప్రసాదరావు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మోపిదేవి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నిర్మూలనపై గ్రామసభ నిర్వహించారు. పలు దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నిషేధంపై మండల పరిషత్ పర్యవేక్షకుడు పాండురంగారావు, ఈవోపీఆర్డీ కేటీ సుందరి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ర్యాలీ

చల్లపల్లి: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీడీవో ఏవీ రమణ ప్రజలను కోరారు. శనివారం చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవోఆర్డీ రవిశంకర్, ఈవో పివి.మాధవేంద్రరావు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆస్పత్రి డైరెక్టర్ వరదా హరిగోపాల్ నారసంచులు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ తోట కనకదుర్గ పాల్గొన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణల్లో స్వచ్ఛ కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు 84 మంది స్వచ్ఛసేవలో పాల్గొన్నారు.

నగరాన్ని స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు, పక్కన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్: సమష్టి బాధ్యతతో నగరాన్ని స్వచ్ఛ మచిలీపట్నంగా తీర్చిదిద్దుదామని నగరవాసులకు ఆర్టీసీ చైర్మన్ పిలుపునిచ్చారు. కోనేరుసెంటర్‌లో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ మచిలీపట్నం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శానిటరీ సెక్రటరీలను సత్కరించారు. కలెక్టర్ డీకే బాలాజీ ఇచ్చిన పిలుపు మేరకు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కోనేరుసెంటర్‌కు తీసుకు వచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.



నంగేగడ్డలో వీఎం రంగా విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, బండి రామకృష్ణ, కొనకళ్ల బుల్లయ్య తదితరులు

పేదల పెన్నిధి వీఎం రంగా

నాగాయలంక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా అన్ని వర్గాల అభిమానం చూరగొన్న నాయకుడని, పేదల పెన్నిధి అని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత రంగా పోరాడాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. నంగేగడ్డలో రంగా అభిమానులు ఏర్పాటు చేసిన వీఎం రంగా విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించారు. వీఎం రంగా పేరు సామాజిక భవనాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయిస్తామని వారు తెలిపారు. మత్తి వెంకటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, చిలకలపూడి పాపారావు, మండలి వెంకట్రామ్, యాసం చిట్టిబాబు, బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ, బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, మెండు లక్ష్మణరావు, మాదివాడ రాము, గుడివాక శేషుబాబు, రాజనాల మాణిక్యాలరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. నాగాయలంకలో వి.కోటేశ్వరరావు, జనసైనికుల ఆధ్వర్యంలో జనసేన పార్టీ దిమ్మెను ఎంపీ, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. భారీ బైక్ ర్యాలీలతో కార్యకర్తలు, కాపు నేతలు నంగేగడ్డకు తరలివెళ్లారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేస్తాం: ఎంపీ బాలశౌరి

పెడన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పలువురు ప్రముఖులు పలుమార్లు తన దృష్టికి తెచ్చారని, ఎంపీ నిధులు, సీసీఏ నిధులు సమకూర్చి శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సమావేశానికి బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, నిధులకు కటకట ఏర్పడిందని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఢిల్లీ పెద్దలతో మాట్లాడి రూ. 3వేల కోట్లు తెచ్చారని, ఆ నిధులతో గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని అన్నారు. బాలశౌరి సహకారంతో శ్మశానవాటికను అభివృద్ధి చేయిస్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. బొడ్డు వేణుగోపాలరావు, కట్టా హేమసుందరమూర్తి, చందన నారాయణరావు, పంచకర్ల సురేష్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం ఉంటే కమిషనర్ సెలవు పెట్టడమేంటి?

● సభ్యులు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, మట్టా శివపావని ఆగ్రహం



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశం ఉండగా కమిషనర్ సెలవుపెట్టడంపై సభ్యులు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, మట్టా శివపావని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ పనితీరు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అజెండాలోని 40 అంశాలకు 37 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మూడు అంశాలను తిరస్కరించారు. కమిషనర్ కారు అద్దె చెల్లింపు, స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంటు కింద 4వ వార్డులో నిర్మించిన మెటల్ రోడ్డుకు బిల్లు చెల్లింపు, అదే వార్డులో నిర్మించిన ఉర్దూ మదరసా కమ్యూనిటీ హాలుకు బిల్లు చెల్లింపు అంశాలను తిరస్కరించారు. 4వ వార్డులో నిర్మించిన మెటల్ రోడ్డుపై స్టే ఉండగా కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపు అంశాన్ని అజెండాలో ఎందుకు చేర్చారంటూ సభ్యురాలు రహేతున్నీసా ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలోనే డ్రెయినేజీల్లో పూర్తిస్థాయిలో సిల్టు తొలగించాలని, బంటుమిల్లి రోడ్డులో చేపల విక్రయాలను నిషేధించాలని శివపావని కోరారు. చేపల విక్రయాలను నిషేధించమని కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని కటకం ప్రసాద్ ఆరోపించారు. మచిలీపట్నంలో మాదిరిగా పెడనలో కూడా ఆక్రమణలు తొలగించాలని కమిషనర్‌ను కోరారు. వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా మాట్లాడుతూ, రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల వద్దే కాకుండా మసీదులున్న వార్డుల్లో కూడా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వేసవిని పురస్కరించుకుని పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని చైర్‌పర్సన్ నాగకుమారి తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ మట్టా రాజా, టీపీవో సృజనకుమారి, ఆర్ఐ వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, జేఏఓ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నాగాయలంక పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న జీఎస్ రావు, ఎస్పీ గంగాధర్‌రావు

పోలీస్ శాఖకు రెండు కార్లు వితరణ

అవనిగడ్డ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): లిఖిత ఇన్‌ఫ్రా లిమిటెడ్ అధినేత గడ్డిపాటి శ్రీనివాసరావు పోలీసుశాఖకు రెండు కార్లు వితరణగా అందజేశారు. శనివారం ఎస్పీ ఆర్.గంగాధర్‌ను కలిసి తన స్వగ్రామమైన నాగాయలంక పోలీస్ స్టేషన్‌కు ఓ మహీంద్రా కారును అందజేశారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు కూడా మరో వాహనాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్న పోలీసులను ప్రోత్సహించేలా నాగాయలంక, చల్లపల్లి పోలీస్ స్టేషన్లకు వాహనాలు సమకూరుస్తున్నట్లు జీఎస్ రావు తెలిపారు. జీఎస్‌రావును ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు శాలువాతో సత్కరించారు. నాగాయలంక పోలీస్ స్టేషన్‌కు అందించిన మహీంద్రా వాహనాన్ని వారిద్దరూ ప్రారంభించారు.

గడ్డిపాటికి ఎంపీ బాలశౌరి పరామర్శ

చల్లపల్లి: పారిశ్రామికవేత్త గడ్డిపాటి శ్రీనివాసరావు(జీఎస్ఆర్)ను ఎంపీ వల్లభనేని బాలశౌరి పరామర్శించారు. జీఎస్ఆర్ అత్త గుండపనేని పుష్పావతి కొన్నిరోజుల క్రితం మరణించగా రామానగరం వచ్చిన ఎంపీ, జీఎస్ఆర్ దంపతులను పలకరించారు. ఎంపీని ఎమ్మెల్యే అల్లుడు శీలం అశ్విన్ కుమార్, టీడీపీ నేతలు ముమ్మనేని నాని, తుమ్మల చౌదరిబాబు, రావి నాగేశ్వరరావు, కోనేరు బలరాం, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మచిలీపట్నం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో గోపాల్‌నగర్‌కు చెందిన జి.మాధురి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న మాధురిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అత్త, మామల వేధింపుల వల్ల మనస్తాపంతో ఆమె నిద్ర మాత్రలు మింగిందని తెలిపారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో డంపింగ్ యార్డు వద్ద 36వ డివిజన్‌లో నివసిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, డంపింగ్ యార్డును తొలగించాలని సీపీఎం నాయకులు కొడాలి శర్మ, బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శనివారం డంపింగ్ యార్డును సీపీఎం నాయకులు సందర్శించారు. డంపింగ్ యార్డు వద్ద పాతికేళ్లుగా పేద ప్రజలు జీవిస్తున్నారని, ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు కడుతున్నారని, అయితే వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డును రుద్రవరానికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్, మాదాల వెంకటేశ్వరరావు, టి.రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

మచిలీపట్నం టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం ముక్కొల్లు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులకు చలమలశెట్టి చారిటబుల్ ట్రస్టు సాయం అందించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఉత్తారపల్లి రాజేష్, లక్ష్మణ తదితర 13 కుటుంబాలకు చెందిన వలస కార్మికులకు నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు, వీఆర్వో గుడివాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నడకుదిటి నరసింహారావు కుటుంబసభ్యులకు వేదవ్యాస్ పరామర్శ

మచిలీపట్నం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు మాతృమూర్తి ఈశ్వరీ మీనాక్షి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. ఈశ్వరీ మీనాక్షి కుమారుడు నడకుదిటి అర్జున, కొల్లు నీలిమ తదితరులను పరామర్శించారు.



నడకుదిటి అర్జునను పరామర్శిస్తున్న బూరగడ్డ వేదవ్యాస్

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

చెస్ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియం కమిటీ అధ్వర్యంలో 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చెస్ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ఆర్.గౌరీ ఇషిత ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో ఇషితను ఆయన అభినందించారు. ఇషిత, కోచ్ స్వర్ణలతను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.



ద్వితీయ స్థానం సాధించిన ఇషితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం 22వ వార్డు రైలుపేటలో ప్రజావేదిక శిబిరాన్ని నిర్వహించి, ప్రజల నుంచి ఆయన అర్జీలను తీసుకున్నారు. సమస్యలను విన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకునేందుకు వార్డులవారీగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూస్తానన్నారు. తొలుత వార్డులో ద్విచక్రవాహనంపై పర్యటించి పరిసరాలను పరిశీలించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు ఆకారపు రాకేష్, షౌకత్‌జానీ, పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహనరావు, కొడాలి బాలు, గడ్డం ప్రకాష్‌దాసు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కష్టపడి పనిచేయండి

● మండల నాయకులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన

నందివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని మండల నాయకులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శనివారం నందివాడలో కో-ఆపరేటివ్ బ్యాంక్ దగ్గర టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు అధ్యక్షతన నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఆక్వా సాగు, చేపల చెరువులు ఉండడంతో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని నాయకులు కోరారు. పంచాయతీల్లో పనికి ఆహార పథకం పనులు అంచనాలు వేసేలా చూడాలని కోరారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వెంకట వీరయ్య చౌదరి(బాబ్జీ), మండల డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు, యార్లగడ్డ రవి, యలమంచిలి సతీష్, రామాపురం సర్పంచ్ మాదివాడ సురేష్, ఆరికెపూడి రామశాస్త్రి, చాట్రగడ్డ రవి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హామీ ఇచ్చారు. శనివారం నాయిబ్రాహ్మణ కాలనిలో పక్షవాతంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన మండలంలో పార్టీ ఎన్నికల క్యాంపెయినర్‌గా పనిచేసిన కార్యకర్త పావులూరి రంగారావు(55)ను ఆయన పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం నుంచి సాయం అందించేలా చూస్తానని తెలిపారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకివెంకటగురుమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణా డెల్టా వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కొమరవోలు సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు తాడిశెట్టి మధు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

పామర్రు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు సుదేష్‌బాబు ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నివేదికలను అందించారు. వైద్యులు నాగేశ్వరరావు, పిసుధారాణి, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. పమిడిముక్కల ప్రజాపరిషత్ కార్యాలంలో శనివారం ఎంపీపీ కె.వేదసుప్రజ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉద్యోగులు సమాచారం ఇవ్వడంలేదని, కార్యదర్శులు అందుబాటులో ఉండటంలేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పార్టీల కతీతంగా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి ప్రొటోకాల్ తప్పకుండా పాటించాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు. రెండున్నరేళ్ల క్రితం చేసిన పనులకు ఎం బుక్‌లు అందుబాటులో లేవని ఉద్యోగులు చెబుతున్నారని ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తంచేశారు. ఇన్‌చార్జ్‌లకు బదులు పర్మినెంట్ సెక్రటరీలను నియమించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలో 60 రోజుల్లో రూ.6.29 కోట్లతో అభివృద్ధిపనులు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. వైస్ ఎంపీపీలు మహేశ్, సీతారామయ్య, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ వెంకటరమణకుమారి పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

యాప్‌లు, సర్వేలు ఇతర కార్యాలయ సాధారణ పనులతో పెరిగిన పని భారం తగ్గిచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు కార్యదర్శులు మొరపెట్టుకున్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.7.12లక్షలు

పామర్రు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 90రోజులకు రూ.7,12,502 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి పి.ప్రసాదరావు తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి విసుధాకర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. తాడిశెట్టి వెంకటేశ్వరరావు, దాడి పవన్, మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ శిబిరానికి విశేష స్పందన

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో కార్మిక శాఖ శనివారం ఏర్పాటుచేసిన ఈ-శ్రమ్ కేంద్రానికి విశేష స్పందన లభించింది. ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు మొదటి రోజే 146మంది కార్మికులను తమ పేర్లను నమోదు చేసుకున్నారని యూనియన్ కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు.



గుడివాడ తుమ్మల రామబ్రహ్మం పార్కులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పామర్రులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



బిళ్లపాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు



మొవ్వలో ర్యాలి నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు



గుడ్లవల్లేరులో విద్యార్థుల ర్యాలీ



పెదపారుపూడి సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ రంగారావు, సర్పంచ్ చప్పిడి సమీర

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు కంకణబద్ధులవుదామని పట్టణవాసులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. శనివారం తుమ్మల రామబ్రహ్మం పార్కులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో హోమియోపతి కళాశాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి అన్నే నవీన్, జిల్లా క్యాబినెట్ సభ్యులు రామదేను వేణుబాబు, సభ్యులు మురళీధరరావు, వెంకట్రావు, వై.రవీంద్రనాథ్, ప్రగతి సభ్యులు అన్నే నీరజ పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రపరిచారు. అగ్రిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. 13వ వార్డు బాపూజీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆస్పత్రి పరిసరాలను శుభ్రపరిచారు. వైద్యాధికారి డాక్టర్ జాన్ డేవిడ్‌ట్విన్ సెన్, ఐసీడీఎస్ అధికారి విజయఫ్లారెన్స్, సూపర్‌వైజర్ భవాని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర సంచులే వాడాలి

పామర్రు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరం భాగస్వాములవుదామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిరోధించి, కాగితం కవర్లు, జ్యూట్ బ్యాగులు, వస్త్ర సంచులనే వాడాలని ఆయన సూచించారు. ఎంపీడీవో కె.జ్యోతి, పంచాయతీ, సచివాలయ ఉద్యోగసిబ్బంది పరిసరాలను పరిశుభ్రంచేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేకాధికారి ఎం.ఫణిధూర్జటి, ఈవోపీఆర్డీ కిషోర్, పంచాయతీ ఈవో సలీం, వల్లూరిపల్లిగణేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, తాడిశెట్టి మధుశేఖర్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాల్లో ఎంపీడీవో టి.విజయసారథి, కార్యదర్శి నరసింహారావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు, అధికారులు ర్యాలీ చేసి, మానవహారం నిర్వహించారు. క్యారీబ్యాగ్‌ల నిరోధంపై పంచాయతీ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమమాన్ని నిర్వహించారు.

గుడివాడ మండలంలో..

గుడివాడ రూరల్: మల్లాయిపాలెంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో, బిళ్లపాడులో మండల వ్యవసాయాధికారి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వీఆర్వోలు, వీఆర్ఏలు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

మొవ్వ మండలంలో..

కూచిపూడి: మొవ్వ, కూచిపూడి, పెదపూడి, చినముత్తేవి గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మానవహారం, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. రహదారుల వెంట చెత్తాచెదారాలను శుభ్రపరిచారు. మొవ్వలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఈవో పీఆర్డీ పరమాత్మ, కార్యదర్శి సోమేశ్వరరావు, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నందివాడ మండలంలో..

నందివాడ: స్వచ్ఛ గ్రామాల రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలని ఎంపీడీవో మల్లేశ్వరి పిలుపునిచ్చారు. నందివాడ, జొన్నపాడు, కుదరవల్లి, తుమ్మలపల్లి, ఇలపర్రు, పొలుకొండ గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు.

పెదపారుపూడి మండలంలో..

పెదపారుపూడి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధిస్తూ తీర్మానాలు చేశామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్, వైద్యాధికారి, వైద్య సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావిక, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సొసైటీలో అవినీతిపై విచారణ జరపాలి

● మునిసిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

● సీఐటీయూ నేత ఆర్సీపీ రెడ్డి డిమాండ్

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ది గుడివాడ మున్సిపల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో జరిగిన రూ.5 కోట్ల అవినీతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధిత మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీలో సభ్యుల షేర్ ధనం ఎంత ఉందో, కోట్లాది రూపాయల ఎవరికెవరికి ఇచ్చారో తేల్చాలన్నారు. ఇరవై ఏళ్లుగా సొసైటీలో నిర్వహించిన ఆడిట్‌పై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. కో-ఆపరేటివ్ ఆడిట్‌లో ఇవి బయటకు రాకుండా ఉండడానికి కారకులెవ్వరో తేల్చాలని డిమాండ్ చేశారు. బాధిత మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి కుంభకోణంపై ఫిర్యాదు చేశారని, ఎమ్మెల్యే వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశాలివ్వడం మంచి పరిణామమని అన్నారు. దీనిని రాజకీయంగా వాడుకోవడం సరికాదని ఆర్సీపీ హితవు పలికారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు రేపాని కొండ పాల్గొన్నారు.

రెండు వర్గాల ఘర్షణ

● పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

గుడివాడ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లింగవరం గ్రామానికి చెందిన రెండు వర్గాలు శుక్రవారం రాత్రి గొడవ పడినట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన గంధం రంగబాబు పది మంది అనుచరులతో కలిసి తన ఇంటిపై దాడి చేసినట్లు గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన సోదరుడి కొడుకు శ్రీనివాసరెడ్డి బైక్‌ను ధ్వంసం చేశారని, ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. శుభకార్యానికి వెళ్తుండగా, చిరంజీవి రెడ్డి అతని ఇంటి వద్ద అడ్డగించాడని, తనను తన అనుచరులను కొట్టారని గంధం రంగబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు స్వీకరించిన రూరల్ పోలీసులు శనివారం రాత్రి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

వీరమ్మ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

గుడ్లవల్లేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మామిడికోళ్ల గ్రామంలో వీరమ్మతల్లి నూతన ఆలయ, అమ్మవారి, విఘ్నేశ్వర విగ్రహ ప్రతి ష్ఠా మహోత్సవాలు శనివారం ఉదయం ఘనం గా ప్రారంభించారు. తొలి రోజు ధాన్యాధివాసంలో ఉన్న అమ్మవారి, విఘ్నేశ్వరుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించి, ఆలయం వద్దకు తీసుకొచ్చారు. విగ్రహాలకు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వీరమ్మ, విఘ్నేశ్వరుడి విగ్రహాలను దర్శించుకుంటున్న భక్తులు

ధనియాలపేట పాతకాలనీకి తాగునీరు అందించాలి: సీపీఎం

గుడివాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ధనియాలపేట పాతకాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పేర్కొన్నారు. శనివారం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా ధనియాలపేటలో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా ఉందని, విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, కాలనీలో రహదారులు సరిగ్గా లేవని స్థానికులు తమ దృష్టికి తెచ్చినట్లు నరసింహరావు తెలిపారు. ఆర్సీపీ రెడ్డి, లంకా సురేంద్ర, రేపాని కొండ, మూడెడ్ల నారాయణ పాల్గొన్నారు.

పీఎస్‌లలో భద్రంగా పదో తరగతి ప్రశ్నపత్రాలు

కూచిపూడి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ, కోసూరు, కాజ, పెదముత్తేవి పదో తరగతి పరీక్షా కేంద్రాల ప్రశ్న పత్రాలను కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. నిడుమోలు కేంద్రానివి గూడూరు పోలీస్ స్టేషన్‌లో కస్టోడియన్, పరీక్షా కేంద్రాల సీఎస్, డీవోల సమక్షంలో పోలీసు అధికారులు భద్రపరిచారు. మొవ్వ మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల నుంచి 390 మంది విద్యార్థులు ఐదు ప్రైవేట్ పాఠశాలల నుంచి 140 మంది మొత్తం 530 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

రూ.32 లక్షలతో కాల్వల పూడికతీత

పమిడిముక్కల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గుడివాడ చానల్ పరిధిలో మంత్రివాడ నుంచి గుడివాడవరకు రూ. 32 లక్షలతో కాల్వల పూడికతీతను ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తిచేసేలా పనులు నిర్వహిస్తున్నామని కేఈ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.బాబు తెలిపారు. మంత్రివాడ లాకుల వద్ద శనివారం ఆయన మొక్కలు నాటి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ కింద కొన్ని కాల్వల పనులకు నిధులు కేటాయించామనాన్నరు. పూడికతీత తీసి కట్టలు బలపరిచే పనులు యంత్రాలతో జరుగుతున్నాయన్నారు. డీఈఈ సూర్య భరత్, ఏఈ ఎం.అరుణ్‌కుమార్ పాల్గొ న్నారు.

వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఆలా రమేష్‌బాబు



పెదపారుపూడి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా భూషణగుళ్ల గ్రామానికి చెందిన ఆలా రమేష్‌బాబు నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం రమేష్ బాబుకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తనకు బాధ్యతలు అప్పగించిన అధినేత జగన్మోహన్‌రెడ్డికి, వైసీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి కైలే అనిల్‌కుమార్‌కు రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహనిర్మాణదారులకు అదనపు ఆర్థిక సాయం

గుడివాడ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ, బీసీ గృహనిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయమందించటానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్ శనివారం తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ప్రత్యేక గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష అందజేస్తామని తెలిపారు. మండలంలో 606 మంది బీసీలు, 562 మంది ఎస్సీలు, 15 మంది ఎస్టీలకు అదనంగా లబ్ధి చేకూరుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.